

హరహర మహాదేవ
కార్తీక సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహుడి కల్యాణం



ఆగిరిపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, కృత్తిక దీపోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం కార్తీక శుద్ధ త్రయోదశి సందర్భంగా లక్ష్మీనరసింహ సుదర్శన మూలమంత్ర హోమం వైభవంగా నిర్వహించారు. ఉదయం నవకలశ పంచామృత స్నపనం, విశేష అలంకరణ, సహస్రనామార్చన, శాంతి కల్యాణం, పూర్ణాహుతి, సాయంత్రం నిత్యహోమం, బలిహరణ, నీరజ మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సాయి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు వేదాంత శేషబాబు, అనంతకృష్ణ నిర్వహించారు.



ధర్నా చేస్తున్న పునరావాస బాధితులు

సాయం అందలేదని ధర్నా

చింతలపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మొంథా తుపాన్ సమయంలో చింతలపూడి నగర పంచాయతీలో ఏర్పాటు చేసిన ఒక శిబిరంలో పునరావాస బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం అందలేదంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం బాధితులు ధర్నా చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ధర్నాకు మద్దతు తెలిపిన సీపీఎం నాయకుడు పాండురంగారావు మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీలో రెండు తుపాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.వెయ్యి, బియ్యం, నూనె వంటి నిత్యావసరాలు ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం బాధితులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయనకు విన్నవించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.

రయ్.. రయ్ !

రయ్ రయ్‌మంటూ టిప్పర్లు దూసుకొస్తుంటే గుండెలు జారిపోతుంటాయి.. పరిమితికి మించి లోడు వేసుకుని మితిమీరిన వేగంతో రాకపోకలు సాగించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున తెలంగాణలోని చేవెళ్ల వద్ద ఒక టిప్పర్ లారీ కంకర లోడుతో వెళుతూ ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో 19 మంది మృత్యువాత పడ్డారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనూ తరచూ టిప్పర్ల ప్రమాదాలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు

వేగంగా దూసుకొస్తున్న టిప్పర్లు

- పరిమితికి మించి లోడు.. మితిమీరిన వేగం
- తరచూ ప్రమాదాలు..ప్రాణాలు పోతున్నా వైనం
- ఏలూరులో భారీ వాహనాల నిషేధం..
- ఇది ప్రకటనలకే పరిమితం
- దర్జాగా తిరుగుతున్నా పట్టని పోలీసులు
- కానరాని ట్రాఫిక్ ఆంక్షల బోర్డులు

ఏలూరు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు టిప్పర్ల జోరు ఇటీవల ఎక్కువైంది. అనధికారికంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తుండడంతో చెరువులు, కాలువల మట్టిని టిప్పర్లలో తరలించి పూడిక చేపడుతున్నారు. జంగారెడ్డిగూడెం మండలం ఎర్రకాలువ జలాశయంలో కనిపించిన ప్రాంతాన్ని అంతా నిలువునా తవ్వేశారు. పంగిడిగూడెంలో స్థానికులు టిప్పర్లను అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. పోలవరం కాలువ గట్లకు తూట్లు పొడిచి టిప్పర్లలో తరలించేశారు. అనధికారిక తవ్వకాలు కావడంతో మట్టిని తరలించేటప్పుడు అతి వేగంగా వాహనాలను నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు అధిక లోడుతో టిప్పర్లు రాకపోకలు సాగించడంతో జిల్లాలో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. వాస్తవానికి టిప్పర్ లారీలకు 25 నుంచి 35 టన్నుల పరిమితి వరకు అనుమతి ఉంటుంది. కాని 50 నుంచి 60 టన్నుల వరకు ఇసుక, మట్టి, కంకరలను తరలిస్తున్నారు.

ఏలూరు నగరంలో టిప్పర్ల జోరు

ఏలూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు ప్రకటనలకే పరిమితం అవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయడంలో వైఫల్యం చెందడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నగరంలో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంది. ఈ సమయంలో నగరంలో రోడ్లపై వాహనాలను పెట్టి ఎగమతులు, దిగుమతులు చేయకూడదు. ఏలూరు పెదపాడు బ్రిడ్జి నుంచి అంబికా థియేటర్, పెద్ద పోస్టాఫీస్, గడియార స్తంభం మీదుగా మాదేపల్లి రోడ్డులోకి ఇరువైపులా భారీ వాహనాల రాకపోకలు పూర్తి నిషేధం. ఏలూరు జూట్‌మిల్లు దగ్గర నుంచి పెదపాడు బ్రిడ్జి మీదుగా వంగాయిగూడెం మీదుగా కైకలూరు రోడ్డులో వాహనాలు వెళ్లాలి. కాని ఈ నిబంధనలు అమలు చేయడంలో ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందడంతో ఇష్టారాజ్యంగా వాహనాలు నగరంలోకి తిరుగుతూనే ఉన్నాయి. ఏలూరు కలపర్రు టోల్ గేటు నుంచి ఆశ్రం ఆసుపత్రి వరకు 19 కిలోమీటర్లు నిడివి ఉండగా నగరంలో మధ్య నుంచి వెళ్లితే 9 కిలోమీటర్ల నిడివే ఉండడంతో భారీ వాహనాలు ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల టిప్పర్లు జోరుగా రాకపోకలు సాగిస్తున్నా పట్టించు కునేవారే లేరు. పట్టుకుంటున్నామని, ఫైన్లు వేస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారే తప్ప వాటిని ఆపి వెనక్కి పంపించడం లేదు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో మెఘా ఇంజనీరింగ్ కంపెనీ - మిగతా 8లో..



అక్టోబర్ 3వ తేదీన ఏలూరులో అతి వేగంగా వచ్చి మలుపు తిప్పడంతో నుజ్జునుజ్జు అయిన కారు



ప్రమాదంలో కొడుకు మృతి చెందడంతో రోదిస్తున్న తండ్రిని ఓదారుస్తున్న బంధువు







గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

అదే నిర్లక్ష్యం

మద్యం మత్తులో డ్రైవర్

- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం
- జూబ్లీనగర్ వద్ద భారతీ ట్రావెల్స్ బస్సు బోల్తా.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
- ముగ్గురికి తీవ్రం, ఏడుగురికి స్వల్ప గాయాలు
- కాపాడిన స్థానికులు.. ఆసుపత్రులకు తరలింపు.. డ్రైవర్, క్లీనర్ పరార్..
- తనిఖీలంటూ మొన్న రెండు రోజులు హడావుడి చేసిన రవాణా శాఖ అధికారులు
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

లింగపాలెం/చింతలపూడి/ఏలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లాలో వి.కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం ఘటనలో ప్రయాణికుల సజీవ దహనం మరువక ముందే.. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో దుర్ఘటనలో బస్సుపైకి దూసుకొచ్చిన కంకర లారీ ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడిన ఘటన జరిగిన రోజునే ఏలూరు జిల్లాలో మరో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో డ్రైవర్ బస్సు నడిపిన కారణంగా 25 ఏళ్ల ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణం బలి అయ్యింది. ముగ్గురికి తీవ్రంగా, మరో ఏడుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే హడావుడి చేసే రవాణాశాఖ అధికారులు.. రెండో రోజే తనిఖీలు చేయాల్సిన బాధ్యత తమది కాదన్నట్టు వ్యవహరిస్తుంటారు. ఇదేకోవలో సోమవారం రాత్రి లింగపాలెం మండలం ధర్మాజీగూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సు భారతీ ట్రావెల్స్ స్లీపర్ బస్సు (ఏఆర్ 06 బి 8428) - మిగతా 8లో..

ఉద్యాన పంటలకు..భరోసా!

ఉద్యాన పంటల అభివృద్ధి కోసం అధిక విలువైన క్లస్టర్లు, అర్బన్ ప్రాంతాల పరిసరాల్లో కూరగాయల క్లస్టర్ల అభివృద్ధి పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం, నేషనల్ హార్టీ కల్చర్ బోర్డు నిర్ణయించింది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఎనిమిది ప్రాజెక్టులు (మామిడి, మిరప, అరటి, కోకో పంటలకు) రూ.564 కోట్ల పెట్టుబడితో నేషనల్ హార్టీకల్చర్ బోర్డు ప్రాథమికంగా ఆమోదించింది. రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో 36.59 మిలియన్ల టన్నుల ఉత్పత్తిలో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది.

- అర్బన్ ప్రాంతాల్లో కూరగాయల క్లస్టర్ల ఏర్పాటు.. జిల్లాలో అభివృద్ధిపై రేపు ఏలూరులో వర్క్‌షాప్

ఏలూరు సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):ఈ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాల్లో అనుభవం కలిగిన పారిశ్రామికవేత్తలు, అభ్యుదయ పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్స్/ కంపెనీలు/సంఘాలు/ సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పబ్లిక్, ప్రైవేట్ రంగ సంస్థలు, భాగ స్వామ్య సంస్థలు, కన్సార్షియమ్స్, ఎగుమతిదారులు, ట్రేడర్స్, ప్రాసెసర్స్ దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా ఉద్యాన శాఖ తెలిపింది. ప్రొప్రైటర్ సంస్థలకు అవకాశం లేదు. ఉద్యాన పంటల అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేయబోయే క్లస్టర్స్‌కు సంబంధించి ఏలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 5న వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. వ్యవసాయ, ఉద్యానరంగాల్లో అనుభవం కలిగి, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6గంటల లోపు లక్ష రూపాయలు దరఖాస్తు రుసుం చెల్లించి నేషనల్ హార్టీకల్చర్ బోర్డు వారికి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ డీడీ షాజానాయక్ తెలిపారు.

అధిక విలువైన పంటల క్లస్టర్ల ప్రధానోద్దేశం

వివిధ ఉద్యాన పంటలలో విత్తనం మొదలు పంటల సాగు, యాజమాన్యం, పోస్ట్ హార్వెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు అవసరమైన అన్ని అవసరాలను సమకూర్చి ఉద్యాన పంటల క్లస్టర్లను అభివృద్ధిపరచి ప్రపంచ దేశాలతో పోటీపడేలా తయారు చేయడం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఎగుమతులు ప్రోత్సహించడం, సాగు ఖర్చులను తగ్గించి ఆదాయాన్ని పెంచి రైతులకు రాబడి పెంచడం జరుగుతుంది. మూడు దశల్లో క్లస్టర్ల సమగ్ర అభివృద్ధికి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒకటో దశలో పంటవిత్తనం మొదలు దిగుబడికి అవసరమైన సాంకేతిక సహకారం ఇతర వ్యవసాయ కార్యక్రమాలు విధివిధానాలుగా ఉంటాయి. రెండో దశలో పంటకోత అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు ఉంటాయి. మూడో దశలో క్లస్టర్ ఉత్పత్తుల మార్కెటింగ్ ఇతర అంశాలుంటాయి.

ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం

కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం రాయితీ మొత్తం 100 శాతం గ్రాంట్ రూపంలో లభిస్తుంది. క్లస్టర్ రైతులకు 50 శాతం రాయితీ, క్లస్టర్ నిర్వహణ ఖర్చులకు 40 శాతం రాయితీ , నూతన సాంకేతిక పద్ధతులు అమలు చేయడానికి 10 శాతం విలువ మేరకు ఆర్థిక సహాయం గరిష్ఠంగా 50 శాతం వరకు రాయితీ పొందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు నిర్వ హణకు రైతులకు రావాల్సిన రాయితీ నిధులు రైతుల ఖాతాలకు రెండు విడతల్లో విడుదల అవుతాయి. నిర్వహణ సంస్థలకు నేషనల్ హార్టీకల్చర్ బోర్డు ద్వారా మూడు విడతల్లో నిధులు విడుదల అవుతాయి.



అర్బన్ ప్రాంతాల్లో కూరగాయల క్లస్టర్ల అభివృద్ధి

అర్బన్/ నగరాలకు దగ్గరగా కూరగాయలు పండించే క్లస్టర్లు గుర్తించి అభివృద్ధి చేస్తారు. విత్తనం మొదలు పంట ఉత్పత్తి, కోత అనంతరం యాజమాన్యం , మార్కెటింగ్ అభివృద్ధి చేయడం, పంట నష్టాలను తగ్గించడం ,శిక్షణా కార్యక్రమాల నిర్వహణతో పాటు అనేక అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు ఈ ప్రాజెక్టు రెండు దశల్లో అమలు జరుగుతుంది. ఈ పథకం ప్రైవేటు సెక్టార్, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు /కంపెనీలు, /ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతుంది. ప్రధానంగా టమోటో, ఉల్లి, బంగాళదుంపల పంటలలో కనీసం ఒక పంటకు ప్రాధాన్యత ఇస్తూ ఇతర పంటలు క్యాబేజి, కాలిఫ్లవర్, బెండ, వంకాయ, కాప్సికం, దోస, తీగజాతి కూరగాయలు నిమ్మ, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి పంటలను పండించాలి. అదనంగా స్క్వాష్ మునగ, పనస, బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగి , తోటకూర, పాలకూర, మెంతికూర వంటి పంటలను పండించాలి. గుర్తించిన క్లస్టర్ సమీప ప్రజల కూరగాయల అవసరాల మేరకు కనీసం 50 శాతం కూరగాయల ఉత్పత్తి ఈ క్లస్టర్‌లో జరగాలి.

ప్రాజెక్టు నిర్వహణ సంస్థ అర్హతలు.. ఎంపిక మార్గదర్శకాలు

ప్రాజెక్టు నిర్వహణ సంస్థలు, చట్టపరంగా గుర్తింపు పొందిన సంస్థ అయి ఉండాలి. ప్రాజెక్టు నిర్వహణ సంస్థ ఆర్థిక స్థోమత కలిగిఉండాలి. ఈక్విటీ పెట్టుబడి, రుణ సౌకర్యం, టర్నోవర్ అంశాలను పరిశీలిస్తారు. ప్రాజెక్టు నిర్వహణ కోసం ఆ సంస్థలకు పలు బాధ్యతలు ఉంటాయి. ఈ ప్రాజెక్టు అమలు మేరకు రైతులకు రావాల్సిన నిధులు రైతుల ఖాతాలకు /రైతుల ఆమోదంతో వెండర్లకు అందిస్తారు. ప్రాజెక్టు నిర్వహణ సంస్థలకు వారి బ్యాంకు ఖాతాలకు మూడు విడతలుగా నిధులు విడుదల చేస్తారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

454 పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

ఏలూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు అర్జీలు వెల్లువెత్తాయి. అర్జీదారులతో కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసింది. గత సోమ వారం తుఫాన్ కారణంగా పీజీఆర్ఎస్ వాయిదా పడింది. దీంతో తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఫిర్యాదుదారులు పోటెత్తారు. జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి పీజీఆర్ఎస్ నిర్వహించగా 454 అర్జీలు అందాయి. జేసీ ఎంజే అభిషేక్‌గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, డీఆర్డీఏ పీడీ విజయరాజు అర్జీలను స్వీకరించారు. కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : ఎస్పీ



ఏలూరు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి సిబ్బంది మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితులకు పోలీస్ శాఖ భరోసా నింపే సంస్థగా నిలవాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా విశ్వాసాన్ని మరింత బలపరిచే దిశగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ హెడ్మాస్టర్ రాఘవేంద్రరావు గతంలో డిజిటల్ అరెస్టు మోసానికి గురయ్యారు. అప్పట్లోనే ఎస్పీ దృష్టికి తీసుకురాగా ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోయిన డబ్బులను బ్యాంక్‌లో పోలీసులు హోల్డ్ పెట్టించారు. దీంతో రాఘవేంద్రరావు పోలీస్ కార్యాలయానికి వచ్చి ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. డిజిటల్ అరెస్టు ఎక్కడా లేదని సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసినా, మీపై కేసులు ఉన్నాయని బెదిరించినా భయపడకుండా 1930కు సమాచారం ఇవ్వాలన్నారు.

'జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి ఊతం'

ఏలూరుసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం రానున్న కాలంలో ఎంతో అవసరమని, ఇకపై రసాయన ఎరువులు లేకుండానే మనం ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో పంటలు పండించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా సూచించారు. కొత్తగా ఎంపికైన టీ- ఐసీఆర్‌పీఎస్‌కు ఐదు రోజుల పాటు జరగనున్న సమగ్ర శిక్షణ కార్యక్రమం ఏలూరులోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం పరిధిలో సోమవారం హబీబ్‌బాషా ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం బి.వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 142 మంది నూతన టీ-ఐసీఆర్‌సీలను (ట్రైనీ ఇంటర్నల్ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్) ఎంపిక చేసినట్టు తెలిపారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో పలు ప్రాంతాల్లో సోమవారం కురిసింది. ఏలూరులో కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.
-ఫొటోగ్రాఫర్, ఏలూరు







ప్రజలకు మంచి జరగాలి : ఎమ్మెల్యే బడేటి

- వైభవంగా లక్ష్మీవారపుపేట జాతరకు ముడుపులు కట్టే కార్యక్రమం

ఏలూరుకార్పొరేషన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి):ఏలూరు నగరం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ మంచి జరగాలనే ఉద్దేశంతోనే జాతర్లను ప్రోత్సహిస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. సోమవారం లక్ష్మీవారపుపేటలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజు బాబుల జాతర మహోత్సవానికి ముడుపు కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి,బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు కట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మేళతాళాలు, బాజా భజంత్రీలు, కోలాట నృత్య ప్రదర్శనలు, వసంతోత్సవాల నడుమ ఉత్సాహంగా ముడుపు కట్టే కార్యక్రమం కొనసాగింది. కొలుపుల కమిటీ ధర్మకర్త కనిగొళ్ళ హేమంత్, కోశాధికారి పోలూరి హరిబాబు, డివిజన్ కార్పొరేటర్ ఇలియాస్ పాషా, డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి కంచు గుమ్మం నాని, క్లస్టర్ ఇన్‌చార్జి మల్లెపు రాము, ఆదివారపుపేట షిర్డీ సాయి ప్రేమ మందిర్ అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చంటి దంపతులు, మేయర్ నూర్జహాన్, తదితరులు



గంగానమ్మ దేవాలయంలో అలంకరణలు


లక్ష తమలపాకుల పూజను అందుకున్న మద్ది ఆంజనేయస్వామి

మద్ది ఆంజనేయస్వామికి
లక్ష తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు సోమవారం లక్ష తమలపాకుల వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం ఒక్కరోజే ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.1లక్ష ఆదాయం సమకూరిందని, 2500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.

బౌద్ధారామాల వద్ద గట్టు తీర్థం


గట్టు తీర్థంలో భక్తులు

కామవరపుకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుంటుపల్లి పంచాయతీ జీలకర్ర గూడెం కొండగట్టుపై బౌద్ధారామాల ప్రాంతంలో కార్తీక సోమవారం నేపథ్యంలో తీర్థం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు విచ్చేసి గట్టుపై గల బౌద్ధ గుహలు, పాలరాతి కట్టడాలు, వలయాలను సందర్శించారు. గట్టుపై ఏకశిలా నిర్మిత ధర్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు సంతాన ప్రాప్తికోసం దీక్షలు చేపట్టారు. తడికలపూడి పోలీసులు రక్షణ ఏర్పాటు చేశారు. పురావస్తు శాఖ ఉద్యోగులు పర్యవేక్షించారు.


చిన వెంకన్న ఆలయంలో కుటుంబసమేతంగా సుడిగాలి సుధీర్

శ్రీవారి సేవలో సుడిగాలి సుధీర్

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని సినీ, బుల్లితెర నటుడు, యాంకర్ సుడిగాలి సుధీర్ ఆదివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పండితుల నుంచి వేదాశీర్వచనం, శ్రీవారి మెమెంటో, ప్రసాదాలను పొందారు. దర్శనానంతరం ఆలయ పరిసరాల్లో సుధీర్ సందడి చేశారు. ఆయనను గుర్తించిన భక్తులు, స్థానికులు ఫొటోలు దిగారు. అనంతరం ఆయన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై లక్ష్మీనరసింహాని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.


గునుపూడి సోమేశ్వరాలయం వద్ద భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరుడు, క్షీరారామలింగేశ్వరస్వామి


పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూలైన్

శంభో.. శివ శంభో..

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు.. శివయ్యకు అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో పట్టిసం వీరేశ్వరుడు


ఆచంటేశ్వరుడికి పాలాభిషేకం


ద్వారకాతిరుమల మల్లికార్జునుడికి అభిషేకం

భీమవరం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రానికి దాదాపు 20వేల మంది దర్శించుకుని ఉంటారని అంచనా. టికెట్లు, ప్రసాదం అమ్మకాల ద్వారా రూ.2,99,900 ఆదాయం వచ్చినట్లు ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ చైర్మన్ చింతలపాటి బంగ్రారాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

కిటకిటలాడిన క్షీరారామం

పాలకొల్లు అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తుల ఓం నమశివాయ ఘోషతో ఆలయం మార్మోగింది. ఆలయ సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సుమారు 8 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. పలు రాష్ట్రాల నుంచి పంచారామ క్షేత్రాల పేరుతో ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు సుమారు 120 వరకూ వచ్చినట్టు పోలీసులు తెలిపారు. అలాగే సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, దేవదాయశాఖ ఈవోలు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. పట్టణంలో పంచారామ క్షేత్రాల వాహనాలతో రద్దీగా మారింది. పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పట్టిసీమ శివక్షేత్రానికి భక్తుల తాకిడి

పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసం తొలి సోమవారం తుఫాన్ ప్రభావంతో లాంచీలు నిలిపివేయడంతో ఆలయానికి భక్తులు రాలేకపోయారు. రెండో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి రావడంతో రద్దీ పెరిగింది. ఆలయంలో స్వామి వారికి భస్మాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సీహెచ్ వెంకట లక్ష్మి భక్తులకు అల్పాహారం, అన్నదానం, భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వర రావు ఆదేశాల మేరకు సీఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ పవన్‌కుమార్ పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరి ప్రవాహ వేగం ఎక్కువగా ఉండడంతో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు.

ద్వారకాతిరుమలలో రద్దీ

ద్వారకాతిరుమల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గర్భాలయంలో శివదేవుని లింగ స్వరూపానికి అర్చకులు అర్చన, అభిషేకాది కార్యక్రమాలు జరిపారు. ఆ తరువాత హారతులను ఇచ్చారు.

ఆచంటేశ్వరుడికి అభిషేకాలు

ఆచంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజామున భక్తులు గోదావరి, కాలువ, చెరువుల్లో కార్తీక దీపాలు వెలిగించారు. శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించుకున్నారు. ఆచంటేశ్వరుని ఆలయం వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల పూజలు, అభిషేకాలతో కిటకిటలాడింది. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, చైర్మన్ నెక్కటి గజేశ్వర రావు, కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


వలంధర్ రేవులో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు

కార్తీక దీపం

నరసాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వశిష్ఠా గోదావరి తీరం సోమవారం కార్తీకశోభ సంతరించుకుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. పట్టణంలో వలంధర్, అమరేశ్వర, మండలంలోని రాజుల్లంక రేవులు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. రేవుల్లో స్నానాలు చేసిన భక్తులు అక్కడే నోములు నోచుకున్నారు. అనంతరం దీపాలను గోదావరిలో విడిచిపెట్టారు. ఇక పట్టణంలోని అమరేశ్వర, కపిలమల్లేశ్వర, ఏకాంబేశ్వర, మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇటు చాలమంది కార్తీక నోములు నోచుకున్నారు. సాయంత్రం వరకు ఉపవాసాలు చేసి రాత్రి శివాలయాల్లో దీపాలు వెలిగించారు.


వీరంపాలెం బాలాత్రిపుర సుందరి ఆలయం

వీరంపాలెం క్షేత్రంలో రేపు స్పటిక లింగ దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న వీరంపాలెం బాలాత్రిపుర సుందరి ఆలయం ప్రాంగణంలోని లక్ష శివలింగ మహాగిరిలో స్పటిక లింగ దర్శనం నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి దర్శన అవకాశం కల్పిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.


చిత్రజ్యోతి
SINCE 1965

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమరయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది


దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్‌'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.


టీంఇండియా జట్టును అభినందిస్తున్న ఛానమిల్లి పాఠశాల విద్యార్థులు

జయహో భారత్

క్రికెట్ ప్రపంచ కప్ భారత మహిళా జట్టుకు అభినందనలు

నిడమర్రు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అకుంఠిత దీక్ష, అద్భుత ప్రతిభతో భారత మహిళల జట్టు క్రికెట్ ప్రపంచకప్ గెలుచుకోవడంతో విద్యార్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చానమిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం జాతీయ జెండా ప్రదర్శిస్తూ మానవహారం నిర్వహించి అభినందనలు తెలియజేశారు. ప్రపంచ విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఎంఈవో2 వై.శేషగిరిరావు అన్నారు. బాలికలకు పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించగలరనడానికి ఈ విజయమే నిదర్శమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ జట్టుకు ఎంపీ మహేశ్ అభినందన

ఏలూరు టూటౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు వరల్డ్‌కప్ ఫైనల్‌లో అద్భుత విజయం సాధించడంపై ఎంపీ మహేశ్ కుమార్ అభినందనలు తెలిపారు. మహిళా క్రికెట్ జట్టుకు ఇది సువర్ణ అధ్యాయం అన్నారు. ప్రతీ భారతీయుడు గర్వపడేలా ఆడి వరల్డ్‌కప్ సాధించడం అద్భుతం అన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని పట్టుదలతో ప్రపంచ విజేతగా నిలిచిన తీరు స్ఫూర్తిదాయకం అన్నారు.


ప్రపంచకప్ సాధించడంతో ఏలూరులో యువత ఆనందోత్సాహం

రహదారి మరమ్మతు పనులు చేపట్టాలి

ఇంజనీరింగ్ అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

ఏలూరుసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో జడ్పీ రహదారుల పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సోమవారం ఆమె సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులు, పంటల రవాణా మార్గాల మరమ్మతు పనులను వేగవంతం చేయాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి హేబిటేషన్‌కు రహదారి కనెక్టివిటీ ఉండేటా అధికారులు కృషిచేయాలన్నారు. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాయన్నాయని చెప్పారు. జిల్లా ప్రజలకు ఎంతో కీలకమైన రహదారి సమస్య పరిష్కరించేందుకు ఈ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పద్మశ్రీ తెలిపారు.

11న జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం

ఏలూరుసిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 11న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని సీఈవో ఎం.శ్రీహరి సోమవారం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

అంతర్జాతీయ వ్యవసాయ సదస్సుకు

రాష్ట్ర రైతు నాయకుడు బలరాం



పాలకోడేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ ఫర్ అగ్రేరియస్ స్టడీస్ (ఫాస్) ఈ నెల 6 నుంచి 9 వరకు కేరళలోని తిరువనంతపురంలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర రైతు నాయకుడు బి.బలరాం హాజరు కానున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు తెలిపారు. బెంగుళూరు కేంద్రంగా పని చేస్తున్న స్వతంత్ర అధ్యయన పరిశోధనా సంస్థ ఆహ్వానం మేరకు అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతున్నట్లు బలరాం తెలిపారు. సదస్సును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, కౌలు రైతుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ అధ్యక్షుడిగా బలరాం పని చేశారు. కేరళలో జరుగుతున్న సదస్సుకు అత్యంత ప్రాధాన్యం ఉందని ఆయన తెలిపారు.


టంగుటూరి, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు విరిగిన చేయి, మడమ

మహనీయులు మన్నించాలి!

- విరిగిన జాతీయ నాయకుల విగ్రహాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పాలకొల్లు అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌లో జాతీయ నాయకుల విగ్రహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన విగ్రహాలలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం కుడిచేయి పెచ్చులూడిపోయాయి. అమరజీవి పొట్టి శ్రీరాములు కాలి మడమ వద్ద విరిగిపోయింది. అధికారులు కానీ, రాజకీయ నాయకులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయం.

పునర్నియామకాలకు వైద్య ఉద్యోగుల డిమాండ్

ఏలూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియామకాల ప్రక్రియలో విద్యార్హతలు, అనుసరించిన నిబంధనలను తప్పుబడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖలో 2003, 2006 సంవత్సరాల్లో చేపట్టిన కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగాల భర్తీ చెల్లదం టూ ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు గతేడాది డిసెంబరు 5న ఏపీలో ఉద్యోగాల నుంచి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకుని సంబంధిత ఉద్యోగులం దరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు గత నెల 29న ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని ఏపీ కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు నామాల రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశా రు. సోమవారం అమరావతిలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ వీర పాండియన్, డైరెక్టర్ డాక్టర్ పద్మావతికి వినతిపత్రాలను అంద జేశారు. వివరాలను స్థానిక మీడియాకు తెలిపారు.

అవిభక్త రాష్ట్రంలో జరిగిన నియామకాల్లో తెలంగాణ ఉద్యోగులను కొనసాగించడానికి అక్క డి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రం తొలగించడం వివక్ష కిందకే వస్తుందని కోర్టు అభిప్రాయపడిందన్నారు. ఆ మేరకు తొలగించిన కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులందరినీ రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా కారుణ్య నియామకాల కింద నియ మించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. ఈ నియామకాలకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా ఎటువంటి హక్కులు, ప్రయోజనాలు, పదోన్న తులుండబోవని కోర్టు స్పష్టం చేసిందన్నారు. కోర్టు తీర్పుని గౌరవిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, ఆ దిశగా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో సోమ వారం ఉన్నతాధికారులను కలిసి అభ్యర్థించా మన్నారు. మరోవైపు కోర్టు తీర్పుని అడ్డుపెట్టు కుని జిల్లాల్లో అనర్హులైన వారిని కూడా జాబితా ల్లో చేర్చి కారుణ్య నియామకాలు చేపట్టడానికి డీఎంహెచ్‌వో కార్యాలయాల సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్టు తమకు తెలిసిందన్నారు. ఉమ్మడి 'పశ్చిమ'లో మొత్తం 104 మంది ఎంపీహెచ్ఏ (మేల్) కాంట్రాక్టు ఉద్యోగ లను గతేడాది డిసెంబరులో కోర్టు తీర్పు మేరకు తొలగించారని, వీరిలో సుమారు 10 మంది వరకు మరణించడం, రిటైర్మెంట్ వయస్సు పూర్తికావడం జరిగాయన్నారు. ఇలా పునర్నియామకాలకు అవకాశం లేని ఉద్యోగుల స్థానాల్లో అనర్హులను కారుణ్య నియామకాల్లో చేర్చేలా డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది కుట్ర పన్ను తున్నట్టు ఆరోపించారు. కారుణ్య నియామకాలను అర్హులకు మాత్రమే పునర్నియా మకాలు జరిగేలా చర్యలు తీసుకుని, త్వరగా నియామకాలను పూర్తిచేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేసిన వారిలో సంఘ నాయకులు రమణా రెడ్డి, కిరణ్, ప్రభాకర్, మూర్తి, షఫీ, గోవిందరెడ్డి తదితరులున్నారు.




విజయ లలిత మృతదేహం.. మాట్లాడుతున్న మృతురాలి తల్లి

వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి

- బంధువుల ఆరోపణ.. ఆస్పత్రి వద్ద ఆందోళన
- ఫిట్స్ కారణంగానే మృతి చెందిందన్న వైద్యురాలు

భీమవరం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె మరణానికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన కొందరు భీమవరం టూ టౌన్‌లోని ఒక ఆసుపత్రి వద్ద సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోగల్లు గ్రామానికి చెందిన కొప్పినీడి విజయలలిత (21)ను గత నెల 31న పట్టణంలోని ఒక ఆసుపత్రికి ప్రసవానికి తీసుకువెళ్ళారు. అక్కడ విజయలలితను చేర్పించగా పురుడు పోయడానికి ఆపరేషన్ అవసరమవుతుందని మరో ఆసుపత్రికి తీసుకువెళ్ళాలని అక్కడున్న వైద్యులు సూచించారు. దీంతో వేరే ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడి వైద్యురాలు ప్రస్తుతం ఆపరేషన్ అవసరం లేదని, అబ్జర్వేషన్‌లో పెడతామని సూచించారు. తమ కుమార్తెను ఆసుపత్రిలో చేర్చగా అక్కడ వైద్యురాలు సరిగ్గా పట్టించుకోలేదని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. కాగా ఈ నెల రెండవ తేదీన విజయలలితకు స్కానింగ్ చేసి ఆపరేషన్ చేయాలని వెంటనే ఆపరేషన్ చేసి పుట్టిన బిడ్డను అబ్జర్వేషన్‌లో పెట్టారని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల వరకు విజయలలిత ఆరోగ్యంగా ఉందని, ఆ తర్వాత డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ కారణంగానే మరణించిందని బంధువులు ఆరోపించారు. పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ జి.కాళీచరణ్, ఎస్ఐ రెహ్మాన్, సిబ్బందితో కలిసి ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ వైద్యులతో మాట్లాడారు. దీంతో వైద్యురాలు డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఇటువంటి కేసులు లక్షల్లో ఒకటి వస్తాయని, ఫిట్స్ రావడం వల్లే విజయలలిత మృతి చెందిందని, తమ నిర్లక్ష్యం ఏమీ లేదని వెల్లడించారు. మృతురాలి బంధువులు, వైద్యుల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

లారీని ఢీకొని యువకుడి మృతి

108 సకాలంలో రాకపోవడం వల్లే దక్కని ప్రాణాలు?


రక్తపు మడుగులో మృతుడు రవి

జీలుగుమిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ నిర్వాసిత కాలనీ కొయిదాకు చెందిన కాకాని రవి (30) జీలుగుమిల్లి నుంచి దర్భగూడెం వైపు బైక్‌పై వెళుతుండగా రమణక్కపేట వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో కొద్ది సేపటికి మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఏఎస్ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే 108కి ఫోన్ చేసినా సకాలంలో రాలేదని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీస్‌లు రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న రవిని ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో సైతం ఒక్క 108 వాహనం అందుబాటులోకి రాలేదు. కొయ్యలగూడెం నుంచి 108 వచ్చే లోపు వ్యక్తి మృతి చెందాడు. అత్యవసర స్థితి 108 వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని స్థానికులు కోరారు.

పట్టపగలు చోరీ.. నగల అపహరణ

ఆగిరిపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇంట్లోకి చొరబడి బంగారు వస్తువులు కాజేసిన ఘటన కొత్త ఈదరలోని బెక్కం రుద్ర చంద్రశేఖర్‌రావు ఇంట్లో సోమవారం ఉదయం జరిగింది. చంద్రశేఖర్‌రావు భార్య పెద్ద సీత (55) సమీపంలోని ఓ దుకాణంలోకి పాల కోసం వెళ్ళింది. వెంటనే తిరిగి వచ్చేస్తానన్న ఉద్దేశంతో తలుపులను దగ్గరకు వేసి వెళ్ళింది. ఇదే అదునుగా ఓ ట్రాన్స్ జెండర్ లోపలకు చొరబడి ఇంట్లోనే టేబుల్‌పై ఉన్న ఐదు బంగారం ఉంగరాలు, ఒక గాజు, చెవి దిద్దులు చోరీ చేసి పరారవుతుండగా సీత బంధువు అడ్డుకున్నప్పటికీ ద్విచక్ర వాహనంపై పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.


మెమొరాండం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

టెట్ నుంచి ఉపాధ్యాయులను

మినహాయించాలి

- అధికారులకు ఫ్యాప్టో నాయకుల వినతి

భీమవరం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాప్టో పిలుపు మేరకు జిల్లా కలెక్టరు, జిల్లా విద్యాశాఖాధికారులకు మెమొరాండంలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా ఫ్యాప్టో నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం సూపరింటెండెంట్ తిరుపతిరాజుకు మెమొరాండం అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ విజయ రామరాజు మాట్లాడుతూ గత 25, 30 సంవత్సరాల నుంచి బోధనలో ఉన్న ఉపాధ్యాయులు ఇటీవల వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ రాయాలని విద్యా శాఖ చెప్పడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి చట్ట పరమైన మార్పులు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలిపారు. ఫ్యాప్టో ఇప్పటికే దీని కోసం చట్టపరమైన చర్యలు ప్రారంభించిందన్నారు. సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థకు వెన్నెముకని, వారిని నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్ర భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందన్నారు. ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకోకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కో-చైర్మన్లు పి.సాయివర్మ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణ, జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.


అవార్డు స్వీకరిస్తున్న ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు

భీమవరం పీఎఫ్ ఆఫీస్‌కు అవార్డు

రాజమహేంద్రవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన పురస్కారాల్లో అఖిల భారత స్థాయిలో భీమవరం జిల్లా కార్యాలయానికి అవార్డు దక్కిందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. అవార్డును భీమవరం జిల్లా కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.ఎలీషారావుతో కలిసి న్యూఢిల్లీలో ఈ నెల 1న జరిగిన వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి చేతుల మీదుగా అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగులను ఆయన అభినందించారు. 2022-23లో రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యాలయంగా ఎంపికైందని గుర్తుచేశారు. 2023-24 సంవత్సరానికి స్వచ్ఛత అవార్డుల్లో అఖిల భారత స్థాయిలో తొలి స్థానంలో నిలిచామన్నారు. సిబ్బంది నిబద్ధత, మెరుగైన సేవలకు గుర్తింపు దక్కడం గర్వకారణమని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

భీమవరం క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణంలోని చిన్న వంతెనపై నుంచి గత నెల 31న యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి గల్లంతైన వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పెదపుట్లపూడి గ్రామానికి చెందిన నడికుదుటి దేసింగురాజు(65) క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. గతనెల 28న దేసింగురాజు కుమార్తె బస్వాని లక్ష్మీ పార్వతి తండ్రిని పట్టణంలోని ఒక ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడ చికిత్స పొందుతుండగా భోజనం తీసుకొచ్చేందుకు తండ్రికి చెప్పి ఇంటికి వెళ్లింది. అయితే ఈ లోపుగా దేసింగురాజు తన బ్యాగు, దుప్పటి తీసుకుని వెళ్లి వంతెనపై వాటిని వదిలి డ్రెయిన్‌లోకి దూకేశాడు. సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మొగల్తూరు మండలం పాతపాడు వద్ద సముద్రపు మొగలో మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వైద్యంలో అవకతవకలు.. ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

ఏలూరు అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సరైన వైద్య ప్రొటోకాల్ పాటించకపోవడం, అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం వంటి తీవ్రమైన వైద్య అవతవకలకు ఆర్ఎంపీ ప్రాక్టీషనర్ పాల్పడుతున్నట్టుగా తమ తనిఖీల్లో రుజువుకావడంతో ఏలూరు వంగాయగూడెంలోని నాని క్లినిక్‌ను సీజ్‌చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సోమవారం తెలిపారు. ఇటువంటి వైద్య విధానాలను ఆర్ఎంపీలు, ప్రైవేటు ప్రాక్టీషనర్లు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హానికరమని, చట్టరీత్యా నేరమన్నారు. ఆర్ఎంపీ ప్రాక్టీషనర్లు తమ పరిధిలోని రోగులకు ప్రాథమిక సేవలందించేందుకు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్, ఇంజెక్షన్లు ఇవ్వకూడదన్నారు. ఇటువంటి చర్యలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010, ఏపీ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్ నియమాల ప్రకారం చట్టవిరుద్ధమన్నారు. ఇటువంటి అనధికార వైద్యసేవలు ఎవరైనా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల వద్ద వైద్య సేవలు పొందాలని కోరారు.

అసలు ఏం జరిగింది?

ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి అధికమోతాదులో యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఐవీ ఫ్లూయిడ్స్ వినియోగించడంతో అవి వికటించి కొద్దిరోజుల క్రితం చనిపోయినట్టు సమాచారం. ఈ క్రమంలోనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందిన ఫిర్యాదు మేరకు డీఎంహెచ్‌వో కార్యాలయ డెమో, స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, మరికొందరు గత శుక్రవారం ఆకస్మిక తనిఖీలకు వెళ్లినట్టు తెలుస్తోంది. కాగా ఈ విషయాలను ధ్రువీకరించడానికి లేదా ఖండించడానికి వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు నిరాకరించాయి.

అపస్మారక స్థితిలో బాలిక

- ఆసుపత్రికి తరలించిన పోలీసులు


ఏలూరు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఒక బాలిక(17) మాసిపోయిన కాలేజీ యూనిఫామ్‌లో ఒక వీధిలో అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ బాలికను హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు కొత్తపేట ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఆమె దగ్గర ఒక చీప్ లిక్కర్ బాటిల్ కూడా ఉంది. స్థానికులు 112కు సమాచారం అందించగా వెంటనే ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ తన సిబ్బందితో రాత్రి 9.30 గంటలకు వెళ్లి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి ఆ బాలికకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మద్యం మత్తులో కోమాలో ఉన్నట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆ బాలిక ఎవరు అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ బాలిక మద్యం మత్తులో ఉండడానికి కారణాలు ఏమిటి? మరేమైనా సంఘటనలు జరిగాయా అన్న విషయాలు తెలియాలంటే బాలిక మద్యం మత్తు నుంచి బయటకు రావాల్సి ఉంది.

కేబుల్స్.. కేటుగాళ్లు..

విలువైన మోటార్ల కేబుళ్ల చోరీ.. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం

ద్వారకాతిరుమల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా వ్యవసాయ కేబుళ్లనే టార్గెట్ చేస్తూ కేటుగాళ్లు విజృంభిస్తూ వాటిని తస్కరించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సైతం పలువురు రైతులకు చెందిన కేబుళ్లను తెంపుకుని పోయారు. దీంతో సోమవారం రైతులు ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. తిమ్మాపురంలోని పది మంది వరకూ రైతుల భూముల్లో సుమారు రూ.లక్ష విలువైన దాదాపు 500 మీటర్ల వైరును తస్కరించారు. తరచూ దొంగలు కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేయడంతో బోర్ల కింద సాగవుతున్న కోకో, కొబ్బరి, వరి, ఆయిల్ పామ్ పంటలకు తీరని నష్టం వాటిల్లుతోందని రైతులు కొయ్యలమూడి రామ్మోహన్‌రావు, ఏవీవీ కృష్ణారావు, బోళ్ల సత్యన్నారాయణ, కె.ప్రభాకరావు, కె.నరసింహరావులు ఆవేదన చెందుతున్నారు. గతంలోనూ ఇదే తరహాలో 30నుంచి 40మంది రైతుల పొలాల్లో కేబుళ్ల చోరీకి గురయ్యాయి. ప్రతి నెలా ఇలా కేబుళ్లను కేటుగాళ్లు కట్ చేసుకుని తీసుకెళ్తున్నారు. అనంతరం వీటిని కేజీల లెక్కన విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. తాము మాత్రం మోటార్ల కేబుళ్లను తిరిగి అమర్చుకోవాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది జూలైలో రామన్నగూడెం పంచాయతీ దేవినేని వారిగూడెంలో దాదాపు 15 మంది రైతుల వ్యవసాయ బోర్ల నుంచి 40 నుంచి 50 మీటర్లను కట్ చేసుకుని తీసుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇదే విషయమై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. అయితే దొంగలు దొరకడం లేదు. అంతేకాకుండా కేబుల్ వైర్ల దొంగతనాలు సైతం ఆగడం లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఈ చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.


కేబుల్ వైర్లు కట్ చేసి ఉన్న దృశ్యం



రికవరీ చేసిన సొత్తు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నయీం అస్మి

దొంగలు దొరికారు

- తూర్పుతాళ్లు నగల దుకాణంలో గత ఏడాది సెప్టెంబరులో చోరీ
- 666 గ్రాముల బంగారం, 2.638గ్రాముల వెండి, నాలుగు బైక్‌లు స్వాధీనం

నరసాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామంలోని శ్రీదుర్గా జ్యూయలరీ షాపులో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. అదివారం రాత్రి ఈ చోరీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 666 గ్రాముల బంగారం, 2కేజీల 638గ్రాముల వెండి, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ నయీం అస్మి తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ నరసాపురం, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన చిలకలపల్లి శివాజీ, ముత్యాల వరుణ్, సిద్దిరెడ్డి మనోజ్ కిరణ్, సిద్దిరెడ్డి సంతోష్ కిరణ్‌లను అరెస్టు చేశామన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో ఇద్దరిని, పట్టణంలో మరో ఇద్దరిని పట్టుకున్నట్టు తెలిపారు. వీరి నుంచి దొంగ సొత్తును పట్టణానికి చెందిన రిషఫ్ జైన్, జె.శ్రీనివాస్, జి.శ్రీనివాస్ కల్యాణ్ కుమార్‌లు కొనుగోలు చేశారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశామన్నారు. చోరీ సొత్తులో 71 శాతం రికవరీ చేశామన్నారు. నిందితులకు ఎలాంటి నేర చరిత్ర లేదని, చెడు అలవాటులకు బానిస అయ్యి చోరీకి పాల్పడ్డారన్నారు. ఎటువంటి చోరీలు జరగకుండా వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపారులు తెలియని వ్యక్తుల నుంచి బంగారం కొనుగోలు చేయడం నేరమన్నారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేద, సీఐలు దుర్గాప్రసాద్, యాదగిరి, ఎస్.ఐ.లు వాసు, నాగలక్ష్మి, వెంకట సురేష్‌లు పాల్గొన్నారు.


బాలికను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

బాలిక అదృశ్యం.. 112కు ఫోన్

- 15 నిముషాల వ్యవధిలో తల్లికి బాలికను అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చదువుకోవడానికి తల్లిదండ్రులు హాస్టల్‌లో పెడతారనే భయంతో ఒక బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక కనిపించడం లేదని పోలీసులకు అందిన సమాచారంతో 15 నిమిషాల వ్యవధిలోనే ఆ బాలికను గుర్తించి తల్లికి అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఈ ఘటన జరిగింది. మాదేపల్లి గ్రామానికి చెందిన జయమంగళ మహలక్ష్మి కుమార్తె యువస్మిత(12) సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని 9.59 నిమిషాలకు 112కు అత్యవసర కాల్ చేశారు. రూరల్ ఎస్ఐ వి.నాగబాబు, వారి సిబ్బంది హుటాహుటిన మాదేపల్లి గ్రామానికి వెళ్లారు. ఆ బాలిక రోడ్డుపై నడిచి వెళ్తుండటాన్ని గమనించి వెంటనే సంరక్షణకు తీసుకున్నారు. 10.14 నిమిషాల కల్లా బాలికను గుర్తించి తల్లికి అప్పగించారు.

హోటళ్లలో ఆహారం తనిఖీ

ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరణ

అత్తిలి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుళ్లిన నిల్వ ఉన్న మాంసాన్ని హోటళ్లలో విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఆహార తనిఖీ అధికారులు కోనా వెంకట్ శ్రీధర్ రెడ్డి అత్తిలిలోని హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీ అధికారి వెంకట్ మాట్లాడుతూ అత్తిలిలోని శర్వాణ గ్రాండ్ హోటల్‌ను తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపామన్నారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించే విధంగా ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. హోటళ్లవారు ఆహార భద్రతా నియమాలు పాటించాలని, సురక్షితమైన నీటిని వాడాలని, ఎలాంటి రసాయనాలు వాడరాదని, హోటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఆహార పదార్థాలను విక్రయించేవారు భద్రతా పరిరక్షణ చట్టం ప్రకారం లైసెన్సు పొందాలని, రిజిస్ట్రేషన్ చేయించాలని అన్నారు. లేదంటే పది లక్షల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. కొన్ని హోటళ్లలో పరిశుభ్రత లోపం కనిపించిందన్నారు.


తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా రమేష్ బాబు

పెదవేగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదవేగిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా ఎం.రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన ఏవీ.శివప్రసాద్‌నుంచి రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. రమేష్‌బాబు కృష్ణాజిల్లా రుద్రవరం నుంచి పెదవేగి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగ సంఘం నాయకుడు కె.జయరాజు, ఎ.వి.శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, వై.శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు.

నోటిని శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవు : ఫాదర్ మోజేస్

పెదవేగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దంతాలతో పాటు నోటిని శుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేస్ అన్నారు. జాతీయ టూత్ బ్రషింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దంత వైద్య కళాశాల వైద్యులు పెదవేగి మండలం పినకడిమిలోని ఫాదర్ సిల్వియో పాస్కలీ పాఠశాలలో విద్యార్థులకు బ్రష్ చేసే విధానాన్ని చూపించారు. ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ నోటిని శుభ్రం చేసుకుంటే రోగాలు దరిచేరవని అన్నారు.

పచ్చి ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించండి

చింతలపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పచ్చి ధాన్యం అమ్ముకునే వెలుసుబాటును ప్రభుత్వం కల్పించాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు, జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఎస్.కె.కాలేషా మాట్లాడుతూ పచ్చి ధాన్యం అమ్ముకునే అవకాశం ప్రభుత్వం కల్పించాలని, ఆరుదల ధాన్యం నిబంధనలు 22 శాతం పెంచాలని, కొనుగోలు కేంద్రాలు తక్షణం ప్రారంభించి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, టార్పాలిన్ పట్టాలను 90 శాతం సబ్సిడీపై రైతులకు, కౌలు రైతులకు ఇవ్వాలని, ఈ-క్రాప్‌లో నమోదుకాని పంటలను అమ్ముకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తుఫాన్ నష్టపరిహార నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించాలని కోరారు. నాయకులు తుర్లపాటి బాబు, టి.ప్రసాద్, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

దళిత ఐక్యవేదిక సభను జయప్రదం చేయండి

లింగపాలెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీగూడెంలో ఈ నెల 9న నిర్వహించనున్న దళిత ఐక్యవేదిక సభను జయప్రదం చెయ్యాలని లింగపాలెం మండల దళితనాయకులు పిలుపునిచ్చారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తాడేపల్లి దాస్‌బాబు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లిశ్రీను హాజరయ్యారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించాలన్నా, దళితుల పక్షాన ఉండి వారికి అభివృద్ధి, సంక్షేమం అందించాలన్నా సీఎం చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. దళితులకు అండగా ఉన్న కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఈ నెల 9న ధర్మాజీగూడెంలో దళిత ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మహిళా అధ్యక్షురాలు కొత్తూరి నాగమణి, పి.మహేశ్, ఎం.కృష్ణ, వెంకటనాగేశ్వరరావు, టి.మల్లయ్య ఎం.జయరాజు, పి.శౌరి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అండగా ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భర్త మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తనను, పిల్లలను పట్టించుకోవడంలేదని పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మహిళ చిలకా జ్యోతి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దగ్గర తనగోడు వెళ్లబోసుకుంది. భర్త వేరొక మహిళతో ఉంటూ తనను వేధించడంతో పుట్టింటికి లక్ష్మీపురం వచ్చి ఉంటున్నట్టు చెప్పింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభాకర్. పిల్లలను వచ్చే విద్యా సంవత్సరం గురుకులంలో చేర్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భర్తతో మాట్లాడి, భార్య, పిల్లల ఆలనా, పాలనకు అనువుగా చర్యలకు గ్రామపెద్దలను పురమాయించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన వినతులను పరిశీలించి, పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిపై టీడీపీ నాయకుల ఫైర్

పెదవేగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో చేపల చెరువుల లీజు సొమ్ము కోట్లాది రూపాయలు ఎగ్గొట్టిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి.. ఇప్పుడు నీతి, నిజాయతీ అంటూ నీతివాక్యాలు వల్లె వేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు మండిపడ్డారు. పెదవేగి మండలం కొప్పాకలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి విమర్శించడాన్ని టీడీపీ నాయకులు తప్పుబట్టారు. ఏదో డిప్రెషన్‌లో ఉండి అబ్బయ్య చౌదరి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. టీడీపీ పెదవేగి మండలాధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్‌కుమార్, పెదకడిమి, కొప్పాక గ్రామ సర్పంచ్‌లు కొసరాజు బలరామకృష్ణ చౌదరి, పరాశరం భాస్కర దీక్షితులు, కొప్పాక సొసైటీ చైర్మన్ కొసరాజు వీరవెంకట వరప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రయ్..రయ్ !

(5వ పేజీ తరువాయి)

వాహనాలకు అనుమతులు ఉన్నాయి. ఇదే అదునుగా టిప్పర్లకు అనుమతులు ఉన్నాయని ఇసుక, మట్టిని నగరం మీదుగా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయి.

గతంలో ఎన్నో ప్రమాదాలు : నిత్యం భారీ వాహనాలు, టిప్పర్లు నగరం నడిబొడ్డులో తిరగడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో కర్రల వంతెన వద్ద ఒక వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోగా చిరంజీవి బస్టాప్ వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళను ఢీకొనడంతో ఆమె మరణించింది.ఈ ఏడాది అక్టోబరు 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఒక టిప్పర్ కైకలూరు నుంచి ఏలూరు శనివారపుపేటనకు బుసకను తీసుకువెళ్తూ పెదపాడు బ్రిడ్జి మీదుగా వచ్చి అతి వేగంగా జూట్‌మిల్లు ఓవర్ బ్రిడ్జిపైకి వెళ్తూ ఒక కారును ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజైంది.

కానరాని నిబంధనల బోర్డులు : ఏలూరు నగరంలో భారీ వాహనాల రాకపోకలపై ఉన్న నిబంధనలను విధిగా నగరంలోకి ప్రవేశించే రహదా రులపై బోర్డులను ఏర్పాటు చేయాలి. కానీ ట్రాఫిక్ పోలీసులు ఈ బోర్డులను ఏర్పాటు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. నగరంలో ఏ ప్రాంతాల్లో అనుమతి లేదో ఆ ప్రాంతాల వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేయాలి. భారీ వాహనాల డ్రైవర్లకు అవగాహన నిమిత్తం నగరంలో ప్రధానమైన కూడళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎక్కడా ఎలాంటి బోర్డులు కానరావడం లేదు. టిప్పర్ లారీకు అనుమతులు ఉన్నట్టు ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.అనుమతులు ఎవరు ఇచ్చారో ఆ లేఖను లారీ ముందు అద్దంపై ప్రదర్శించాలి. కాని ఏ టిప్పర్ లారీపై ఇలాంటి లెటర్ కన్పించకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు విచారణ జరిపి భారీ వాహనాల రాకపోకలపై ఉన్న నిబంధనలు అమలు చేసి ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం: షేక్ కరీమ్, ఉప రవాణా శాఖాధికారి, ఏలూరు జిల్లా

జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో రవాణా శాఖ కార్యాలయాల తనిఖీ అధికారులు నిత్యం వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. టిప్పర్ లారీల్లో పరిమితికి మించి అదనపు లోడు వేసుకుంటే జరిమానాలు విధిస్తున్నాం. జిల్లాలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తాం.

అదే నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినా పట్టించుకోలేదు. ఫలితంగా లింగపాలెం మండలం జూబ్లీనగర్ మలుపు వద్ద టర్నింగ్ వద్ద బస్సును తిప్పలేక సోమవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో బోల్తా కొట్టించాడు. ఈ ప్రమాదంలో ఇదే మండలానికి చెందిన అయ్యపరాజు గూడెంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీరంకి ప్రవీణ్‌బాబు(25) అక్కడక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌తోపాటు నరసన్నపాలెం, యడవల్లి, ధర్మాజీగూడెం, లింగపాలెం, అయ్యపరాజుగూడెంకు చెందిన 16 మంది మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్, క్లీనర్‌లు పరారయ్యారు. మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉద్యోగ బాధ్యతల నిమిత్తం కోసం వెళ్తూ ఊరికి దగ్గరలోనే ప్రవీణ్ మృత్యువాత పడటంతో తండ్రి వెంకన్న ప్రభుత్వాసుపత్రిలో రోదనలు మిన్నంటాయి. ఈ మరణానికి ఎవరిది బాధ్యత..?

మలుపులో ఇది మూడో ప్రమాదం : జూబ్లీనగర్ మలుపు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం మూడోది. మలుపు వద్ద గోతులు వుండటం వల్ల అంతకుముందు ఇక్కడే రెండు ప్రమాదాలు జరిగాయి. బస్సు తొలుత మఠంగూడెం-లింగపాలెంలో మధ్యలో ఆటోను రాసుకుంటూ వెళ్లింది. అక్కడ నుంచి వేగంగా వెళ్తూ మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టింది. వారు గాయపడ్డారు. తర్వాత మలుపు వద్ద బస్సు బోల్తా కొట్టింది. బస్సు పడినచోట గొయ్యి ఉండటంతో అందులో పడి ప్రవీణ్‌బాబు మృత్యువాత పడ్డాడు. సమాచారం అందడంతో సీఐ క్రాంతికుమార్, ఎస్‌ఐలు క్షతగాత్రులను అంబులెన్స్‌లో వైద్యం కోసం తరలించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ వచ్చి పరిస్థితిని ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రవీణ్‌బాబు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

క్షతగాత్రులు వీరే : బస్సులో ప్రయాణిస్తున్న 13 మందిని బయటకు తీశారు. స్వల్పగాయాలైన వారిలో 10 మందిని లింగపాలెం పీహెచ్‌సీకి, ఆసన్నగూడేనికి చెందిన అడపా సురేష్‌ను చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో జి.వంశీ, ఎం.కిరణ్, కె.వేణుగోపాలకృష్ణ, కె.నాగశిరోమణి, కె.నాగవెంకట ప్రవీణ్, సీహెచ్ ఈశ్వర్, వి.బెంజిమన్, ప్రసాదరెడ్డి, జి.వెంకటరెడ్డి, జి.వెంకటలక్ష్మితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. కాగా బస్సు ఢీకొట్టగా గాయపడిన బైక్ మీద వెళ్తున్న బి.రెడ్డయ్య, పేరం కృష్ణను తొలుత లింగపాలెం పీహెచ్‌సీకి ఆపై ఏలూరు ప్రభుత్వాస్పతికి తరలించారు.

సత్వరం వైద్యం అందించాలని కలెక్టర్ ఆదేశం: బస్సు ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో అమృతంను ఆదేశించారు. పరిస్థితిని సమీక్షించుకుని అధికారులతో సమన్వయం చేసుకోవాలని సహాయ చర్యలను చేపట్టాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్నను కలెక్టర్ ఆదేశించారు.

పక్కాగా భూముల రీ సర్వే



మానూరులో రీసర్వే చేస్తున్న సిబ్బంది

రైతుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన

తేలనున్న కొలతలు - ఆనందంలో రైతులు

ఏలూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 రెవెన్యూ గ్రామాలుండగా 13 గ్రామాల్లోని, 2 లక్షల ఎకరాల్లో గత వైసీపీ హయాంలో రీ సర్వే తప్పుల తడకగా చేపట్టడంతో విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.. భూ యజమానులకు సమాచారం ఇవ్వకుండా, దస్తావేజులు పరిశీలించకుండానే సర్వే చేసి సెంటు నుంచి 30 సెంట్ల వరకు భూముల కొలతల్లో తేడాలు చేసి అయోమయానికి గురి చేశారు. దీంతో తహసీల్దార్, గ్రామ రెవెన్యూ సదస్సుల్లో తేడాలపై ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. రైతుల బాధను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఎలాగైనా న్యాయం చేయాలనుకుంది. దీనిపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పలు బృందాలను నియమించి రీ సర్వేను చేపట్టింది.

రైతుల సమక్షంలోనే..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంబంధిత రైతులకు సమాచారమిచ్చి వారి సమక్షంలోనే సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి కచ్చితమైన సర్వేను చేపట్టి రైతులకు న్యాయం చేస్తోంది.ఒకటే సర్వే నెంబర్లో ఐదుగురు రైతులుంటే వారికి ఒక్కొక్కరికి ఒక ఎల్పీఎం నెంబరు కేటాయిస్తోంది. ఒక్కటే సర్వే నెంబర్లో ఇద్దరు రైతులు నుంచి కొలతల్లో తేడాలుంటే ఇద్దరికి సమానంగా కొలతలు వేసి జాయింట్ ఎల్పీఎం నెంబరు కేటాయిస్తోంది. గ్రామంలోని విస్తీర్ణాన్ని బట్టి పలు బ్లాక్‌లుగా గుర్తించి ఒక్కో బ్లాకు ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వోను నియమించి విడతల వారీగా సర్వే చేస్తున్నారు. తొందర పాటుతో తప్పుడు సర్వే చేయకుండా ఒక్కో బృందానికి కేవలం తక్కువ ఎకరాలు మాత్రమే కేటాయిస్తున్నారు. జనవరి 2025 నుంచి రీసర్వే కార్యక్రమం చేపట్టింది. మొదటి, రెండో విడత పూర్తి చేసింది. మూడో విడత ప్రారంభించింది. మండలంలో ఇప్పటి వరకు కాట్లంపూడి, మాదేపల్లి, కోమటిలంక, కొక్కిరాయలంక గ్రామాలలో సర్వే పూర్తికాగా, మూడో విడత మానూరు గ్రామాల్లో 4వేల 2వందల ఎకరాల సర్వే చేస్తున్నారు. ఇంకా చాటపర్రు, మల్కాపురం, ప్రత్తికోళ్ళ లంక, పైడిచింతపాడు, జాలిపూడి, శ్రీపర్రు, కలకుర్రు గ్రామాలలో సర్వే నిర్వహించాల్సి ఉంది.

పారదర్శకంగా రీ సర్వే..



పారదర్శకంగా సర్వే చేస్తున్నాం. రైతుల సమక్షంలో డాక్యుమెంట్లు, పొలం సరిహద్దురాళ్లు గుర్తించి పారదర్శకంగా సర్వే చేస్తున్నాం. మూడో విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే చేయనున్నాం. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. మిగిలిన గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి చేస్తాం.

జి.విజయ్ కుమార్, తహసీల్దార్, ఏలూరు రూరల్ మండలం

దెందులూరులో సమాధుల పండుగ

దెందులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాధుల పండుగ ఘనంగా నిర్వహించారు. దెందులూరు ఆర్‌సీఎం విచారణ గురువు ఫాదర్ అమ్మన్ రాజా, సహాయ గురువులు ఫాదర్ కల్యాణ్ దివ్యబలి పూజ నిర్వహించారు. సమాధులను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఎన్టీఏ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఏలూరు అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదును సోమవారం ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. సంఘ నాయకులు రాము, ఇంద్రాణి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సదర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు స్థాపించిన ఫౌండేషన్ ద్వారా సోమవారం ఏలూరు టీమ్ సభ్యులు స్థానిక తూర్పు వీధిలోని శ్రీ కృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో 305 మంది విద్యార్థులకు, ఆర్ఆర్ పేటలోని శ్రీనివాస ఆప్టికల్స్ అధినేత ఆళ్ళ శ్రీనివాస్ బృందం కంటి పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలను వివరించారు. దృష్టిలోపం ఉన్నవారిని గుర్తించి కళ్లజోళ్లు అందజేశారు. ఫౌండేషన్ ఏలూరు టీమ్ సభ్యులు, మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు, మారగాని చంద్రకిరణ్, రాజనాల కిరణ్, మారం జయసూర్య, రాయల సురేష్, జగదీష్, ఇంద్రెడ్డి వాసు, కాసా ప్రసాద్, గోక నెహ్రూల బృందం సేవలందించారు.



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

తాడిచర్లలో మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ

కామవరపుకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాడిచర్ల గ్రామంలోని 25 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాంగణంలో నిర్మించిన మహాగణపతి విగ్రహాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబు దంపతులు ప్రతిష్ఠించారు. పండితులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరయ్యారు. తొలుత విగ్రహ ప్రతిష్ఠకు పార్థసారథి బాబు దంపతులు భక్తులతో ఊరేగింపు జరిపి అనంతరం ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుని విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

దేవతికుల సంక్షేమానికి కృషి చేస్తా

జంగారెడ్డిగూడెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆలపాటి గంగాభవానీ కల్యాణ మండపంలో దేవతికుల కార్తీక మాస వనసమారాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ దేవతికుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం దేవతికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘానికి చెందిన పేదలకు సుమారు రూ.8 లక్షల విలువైన కుట్టు మిషన్లు, గ్రైండర్లు, సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్‌ను ఘనంగా సత్కరించారు. దేవతికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అడ్డ వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి కాసిన సత్యనారాయణ,ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాందూరి నాగేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కాశీ, కోశాధికారి పెండ్యాల రాజారావు, పట్టణ సభ్యులు పాల్గొన్నారు.



చిత్రపటాలకు పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చిర్రి

బిర్సా ముండా స్ఫూర్తి ప్రదాత

బుట్టాయగూడెం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, భగవాన్ బిర్సా ముండాను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని సోమవారం కె.ఆర్.పురం ఐటీడీఏ వద్ద 2కె రన్ మీట్ నిర్వహించారు. నవంబరు 1వ తేదీ నుంచి 15 వరకు ఐటీడీఏ పరిధిలో బిర్సా ముండా స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముందుగా బిర్సా ముండా ఇతర గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వర్ణాంధ్ర 2027లో భాగంగా స్వర్ణ పోలవరం విజన్ యాక్షన్ బుక్‌ను ఎమ్మెల్యే, చైర్మన్ ప్రారంభించారు. పీవో కె.రాములు నాయక్, శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, సర్పంచ్ ఉయికె బుజ్జి, ఏఎంవో కె.శిరమయ్య పాల్గొన్నారు.



జేసీ అభిషేక్ గౌడకు దళితుల వినతి

ఏలూరు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన పూర్వార్జిత ఆస్తులు ఏలూరు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసే విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవి ప్రకాశ్ ఆరోపించారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడను కలిసి వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ అధికారులు ఇష్టం వచ్చినట్లు టౌన్ సర్వేర్ సర్టిఫికెట్ కావాలని గత సబ్ రిజిస్ట్రార్‌కు భిన్నంగా లేని నిబంధనలు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, స్టాలిన్, రవికుమార్ పాల్గొన్నారు.



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

విద్యార్థులను తల్లిదండ్రులే తీర్చిదిద్దాలి

ఏలూరు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లి దండ్రులదే కీలకపాత్ర అని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు.ఏలూరు అమీనాపేటలో ఉన్న శ్రీసురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు ఉపాధ్యాయుల కృషి ఎంత ఉందో తల్లిదండ్రుల పాత్రా అంతేనని ఆయన స్పష్టం చేశారు. కేవలం స్కూల్‌పైనే భారం వేయకుండా తల్లిదండ్రులు ఇంట్లో పిల్లలను చదువు, క్రమ శిక్షణపై దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానం వారు సమాజంలో గౌరవంగా, సుఖంగా జీవించడానికి ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో ఇంగ్లీషు మీడియం ప్రిన్సిపాల్ శ్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఈగల్ ఆర్ఎస్ఐ ఉదయభాస్కర్, సూర్యచక్రి పలువురు హాజరయ్యారు.



దాత రామిరెడ్డి కుటుంబాన్ని సత్కరిస్తున్న దృశ్యం

గుర్వాయిగూడెంలో నిత్యాన్నదానం

జంగారెడ్డిగూడెంరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యాన్నదానం ఘనంగా జరిగింది. ప్రతీ ఏటా దసరా రోజు నుంచి కార్తీక మాసం మొత్తం ప్రతీ రోజు దేవస్థానంలో అయ్యప్ప, భవానీ, హనుమద్, వెంకటేశ్వర స్వామి వారి దీక్షలు చేపట్టే భక్తులు ఇక్కడకు వచ్చి అన్నప్రసాదం స్వీకరిస్తారు. 33వ రోజు అన్నదానంలో భాగంగా సోమవారం గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన జీరి రామిరెడ్డి, పార్వతి దంపతులు తమ కుమారుడు మాధవరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నప్రసాద దాతలుగా వ్యవహరించారు. ఆలయ ట్రస్టు అధ్యక్షులు చిన్ని వాసు స్వామి, కోశాధికారి కూన పార్వతి, నెక్కలపూడి సూర్యచంద్రరావు, కొల్లేపర కృష్ణారావు, రొక్కం కృష్ణారావు, బాకీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తహసీల్దార్‌కు వినతి

దెందులూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తోందని తహసీల్దార్ బత్తుల సుమతి అన్నారు. కనకదుర్గమ్మ గుడి సమీపంలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పోతునూరు గ్రామానికి గండి రాజాతో పాటు పలువురు వినతిపత్రం అందించారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయించాలని గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. అలాగే పోతునూరు గ్రామంలోని యశోధ కృష్ణ యాదవ్ సంఘానికి కమ్యూనిటీ హాల్‌కు స్థలం ఇప్పించాలని పలువురు వినతిపత్రం అందజేశారు.



ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

చింతలపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాలులో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. రక్తదానం వలన తలసీమియా బాధితులకు ఎందరికో ఉపయోగపడుతుందన్నారు. రక్తం దానం వలన వారికి ఏమీ కాదన్నారు.రక్తం ఇచ్చిన దాతలకు పండ్లు, జ్యూస్ అందించారు. ఈ శిబిరంలో 70 మంది రక్తదానం చేశారని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ దాతల నుంచి ఈ రక్తాన్ని సేకరించింది. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తమ సేవలందించింది. సీఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

సమాచారం..

నేడు కారం పార్వతి వర్ధంతి

పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం జిల్లేళ్లగూడెం పంచాయతీ మనుగోపల గ్రామంలో కారం పార్వతి 28వ వర్ధంతిని మంగళవారం మనుగోపల కారం పార్వతి స్థూపం వద్ద నిర్వహించనున్నట్లు సోమవారం ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించారని, వర్ధంతి సభలో ఏపీ రైతు కూలీ సంఘం గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, జిల్లా నాయకులు సవలం రాంబాబు పాల్గొంటారని గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఏలూరుటూటౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీస్ ఆర్థిక సంస్థ ద్వారా టెట్, డీఎస్సీ, ఎస్.ఐ., కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు అర్హులైన మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు మైనార్టీ ఆర్థిక సంస్థ ఇన్‌చార్జి ఈడీ కె.ఎస్.ప్రభాకరరావు తెలిపారు. ముస్లిం, సిక్, బుద్దిస్ట్ పార్శీ, జైన్స్, సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు విజయవాడలోని డైరెక్టర్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ కార్యాలయం ఫోన్ నెంబర్ 08662970567లో సంప్రదించాలన్నారు.

నేడు జర్నలిస్టులకు వర్క్‌షాప్

ఏలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పత్తేబాధ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో వార్తాలాప్ వర్క్‌షాప్‌ను మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభిస్తారని విజయవాడ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ తెలిపారు. జర్నలిజంలో వస్తున్న మార్పులు,అభివృద్ధి, సోషల్ మీడియా వినియోగం, ఖచ్చితత్వం తదితర అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కిషోర్, పీఐబీ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ వర్క్‌షాపును జర్నలిస్టులు విజయవంతం చేయాలని సురేష్ కుమార్ కోరారు.

మహాసభలు జయప్రదం చేయాలి

టి.నర్సాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురంలో ఈ నెల 5, 6వ తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ తెలిపారు. అనేక పోరాటాలతో ముందుండి విద్యా, ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు అసైన్డ్, ఎల్‌టీఆర్ భూపోరాటాల్లో ప్రజల పక్షాన పోరాడి నిలబడిన సంఘం వ్యవసాయ కార్మిక సంఘమని ఈ 32వ మహాసభలు టి.నర్సాపురంలో జరుగుతున్నందున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



లింగపాలెంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు



నందికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో ఉన్న శివాలయాల వద్ద కార్తీక సోమవారం నేపథ్యంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. దక్షిణపు వీధిలోని మార్కండేయస్వామి, జలా పహరేశ్వర స్వామి, అగ్రహారంలోని నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, పత్తేబాదలోని చౌడేశ్వరిరామలింగేశ్వరస్వామి ఆలయం, చెన్న మల్లేశ్వరస్వామి, ఆదివారపు పేటలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వర స్వామి, నాగేశ్వరపురం, బావిశెట్టివారిపేటల్లోని కాశీ విశ్వేశ్వరాలయం, శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద భక్తులు కార్తీక పూజలతో స్వామిని ఆరాధించారు. సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వరాలయంలో ఆలయ అర్చకులు వీరుబొట్ల వెంకటేశ్వరరావు, యాజ్ఞిక బ్రహ్మ వీరుబొట్ల కృష్ణకుమార్ శర్మలు భక్తుల సమక్షంలో స్వామికి కొబ్బరిబొండాల జలాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అంబికా దేవి ఆలయ ప్రాంగణంలోని అంబికేశ్వరస్వామి సన్నిధిలో అంబికా సంస్థల అధినేత అంబికా రాజా, అంబికా ప్రసాద్‌లు అభిషేకాలు నిర్వహించి ఆరాధించగా ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో పూజలు చేయించారు. శివనామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి.

● కామవరపుకోట: కార్తీక సోమవారం నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు అభిషేకాలు, అర్చనలు, బిళ్వార్చనలు నిర్వహించారు. ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. కామవరపుకోటలోని వీరభద్రస్వామి, ఆడమిల్లిలోని ఏకాంబరేశ్వరస్వామి, శనీశ్వరస్వామి, తడికలపూడిలోని గాంగేశ్వరస్వామి, కళ్ళచెరువు,జీలకర్రగూడెం, రావికంపాడు గ్రామాల్లో ఉన్న శివాలయాల వద్ద విశేష పూజలు జరిపారు.

● లింగపాలెం: కార్తీక సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తడంతో శివాలయాలన్నీ శివన్నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆసన్నగూడెం, ముడిచర్లలోని శివాలయాలు, భక్తులు రెండో అన్నవరంగా పిలుచుకునే రంగాపురంలోని సత్యనారాయణస్వామి దేవాలయంలో భక్తులు తెల్లవారు జామునుంచే ప్రత్యేకపూజలు, అభిషేకాలు, దీపోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు వేకువ జాము నుంచే భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

● కుక్కునూరు: మండలంలోని కుక్కునూరు, కౌండిన్యముక్తి, పెదరావిగూడెం గ్రామాల్లోని ప్రసిద్ధ శివాలయాల్లో కార్తీక సోమవారం పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. సమీపగోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. అలాగే కుక్కునూరు శివాలయంలో నందీశ్వరునికి సోమవారం సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో భక్తుల పూజల కోసం నిర్వహకులు తగిన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఓపెన్ చెస్ పోటీల్లో కుశాంక్‌కు ద్వితీయ స్థానం



జంగారెడ్డిగూడెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మల్లంపల్లి కుశాంక్ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. తాడేపల్లిగూడెంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన చెస్ పోటీల్లో 200 మంది పాల్గొనగా కుశాంక్ ద్వితీయ స్థానం సంపాదించాడు. త్వరలో విజయవాడలో నిర్వహించే ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌కు ఎన్నికైనట్లు స్థానిక చెస్ కోచ్ సరళా మాధవి తెలిపారు.



కార్తీక వనసమారాధనలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

ఘనంగా కార్తీక వన సమారాధన

పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో ప్రగడపల్లి గ్రామంలో సోమవారం చాపర్ల ఇంటి పేరు ఉన్న 220 కుటుంబాల కార్తీక వన సమారాధన ఉత్సాహంగా జరిగింది. 11 తరాలుగా తమ ఇంటి పేరిట ఉన్న కుటుంబీకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ప్రగడపల్లిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తమ కుటుంబాల్లో సీనియర్ సిటిజెన్‌లకు సన్మానం నిర్వహించినట్లు చాపర్ల వెంకటాచలం, చాపర్ల గిరి తెలిపారు.

ఫెన్సింగ్ గేమ్‌లో ముగ్గురు విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫెన్సింగ్ గేమ్‌లో ఉత్తమ ప్ర తిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు తెలిపారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భీమవరంలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో తమ కళాశాలలో బి.కామ్ చదువుతున్న విద్యార్థులు టి.దివ్య బంగారు పతకం సాధించిందని, కె.ఉదయ్, కె.వర కుమార్ వెండి పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగురూ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అమృత్‌సర్ లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

మండవల్లి ఎంపీడీవోగా రమణ బాధ్యతలు

మండవల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండవల్లి ఎంపీడీవోగా కె. రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శేషగిరిరావు బదిలీపై వెళ్లిన తర్వాత దాదాపు సంవత్సరం ఇన్‌చార్జితోనే నెట్టుకొచ్చారు. మచిలీపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న రమణను పదోన్నతిపై మండవల్లి బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోకు మండలంలోని కార్యదర్శులు ఘన స్వాగతం పలికారు.

రహదారి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మండవల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రహదారి సమస్యను పరిష్కరించాలంటూ చింతపాడు గ్రామస్థులు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను కోరారు. ఇటీవల వివాహం చేసుకున్న గ్రామానికి చెందిన జడ్డి నేరు లక్ష్మీప్రసన్న దంపతులను సోమవారం అభినందించారు. చింతపాడు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని ప్రయాణాలు నరకప్రాయంగా మారాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. బలే ఏసురాజు, వీర్రాజు, మల్లికార్జున, ముంగర కొండలు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశం



సబ్ కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న కాపా

నూజివీడు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు సంబంధిత శాఖల అధికారులు సత్వరం చర్యలు చేపట్టాలని నూజివీడు ఆర్డీవో వినూత్న ఆదేశించారు. సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖలకు సంబంధించి 95 అర్జీలు దాఖలైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడు మండలం రావిచర్ల గ్రామంలో ప్రభుత్వ భూమి అక్రమంగా మంజూరు చేసిన ఎల్పీ నెంబర్‌ను రద్దు చేసి భూమిని తిరిగి పంచాయతీకి అప్పగించాలని సర్పంచ్ కాపా శ్రీనివాసరావు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు.

మంత్రి ఆదేశాలతో రహదారికి మరమ్మతులు



సింహాద్రిపురం వద్ద రహదారి మరమ్మతులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ముసునూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు - ఏలూరు ప్రధాన రహదారి మరమ్మతు పనులను మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలతో ఆర్ అండ్ బీ అధికారులు చేపట్టారు. పనులను సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబుతో కలిసి డీఈ బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో కొద్దిపాటి పనులను చేసి, సుమారు రూ. కోటి వరకు బిల్లులు చేసుకుని, రహదారిని అభివృద్ధి చేయకుండా గాలికొదిలేయడంతో ఈ రహదారి మరింత అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. సమస్యను ఇటీవల మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. డీఈ బాబురావు మాట్లాడుతూ ఈ రహదారిలో ప్రమాదకర గుంతలను పూడ్చి కంకర వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆవుల బాబురావు పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్టుకు లోకుమూడి విద్యార్థులు



మండవల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలం లోని లోకుమూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ఉమ్మడి కృష్ణాజిల్లా ఖోఖో జట్టుకు ఎంపిక య్యారని హెచ్‌ఎం పులగం వెంకటేశ్వరరావు తెలిపారు. డివిజినల్ స్థాయిలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన వై సంజన, బి. కమల, కె మహి ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ బి. సునీత, సర్పంచ్ నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు వేణుబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోగికి మంత్రి పార్థసారధి ఆర్థిక సాయం



మంత్రి పంపిన సొమ్మును అందజేస్తున్న నాయకులు

ఆగిరిపల్లి, నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి దళితవాడకు చెందిన టీడీపీ నాయకుడు దివంగత బట్టుమర్తి రాజేంద్ర కుమారుడు ప్రభాకర్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో స్థానిక నాయకులు విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో మంత్రి రాజేంద్ర కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకుడు నెరుసు సతీష్ ద్వారా పంపగా సోమవారం టీడీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రభాకర్ ఇంటికి వెళ్లి నగదును అందించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసింహరావు, ఆగిరిపల్లి సర్పంచ్ చౌటుపల్లి లక్ష్మీ విక్టర్ బాబు, నాయకులు పాల్గొన్నారు.



బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ

కైకలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ సమయంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి నేతలు అందజేశారు. కైకలూరు, వేమవరప్పాడు గ్రామాల్లో తుపాన్ సమయంలో పునరావాసా కేంద్రాలకు వెళ్లిన 23 కుటుంబాలకు ఒక్కరు ఉంటే రూ.వెయ్యి, ఇద్దరికి రూ.2 వేలు, అంతకుమించి ఉన్న కుటుంబాలకు రూ.3వేలు చొప్పున అందజేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామ చంద్రరావు, వైస్ ఎంపీపీ రామకృష్ణ, వేమవరప్పాడు టీడీపీ నాయకుడు బోయిన గోవర్ధన, తహసీల్దార్ ఆర్. రామకృష్ణారావు, ఆర్‌ఐ బి. వెంకటేశ్వరరావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: ప్రభుత్వ సాయంగా అందించిన నగదును తహసీల్దార్ రామకృష్ణ, వీఆర్వో గంగాధరరావు తాడినాడలో తుపాను బాధితులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 150 మంది తుఫాను బాధితులకు రూ.3 లక్షల నగదును పంపిణీ చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ప్రమాదాల మలుపులు..



చాట్రాయిలో బాలు చెరువు వద్ద డేంజర్ టర్నింగ్

- స్పీడ్ బ్రేకర్లు లేవు.. హెచ్చరిక బోర్డులు నిల్
- ఇరుకు రోడ్లపై వాహనాలు రయ్.. రయ్
- ఆందోళనలో వాహన చోదకులు

చాట్రాయి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో పలు రహదారి మలుపులు ప్రమాదకరంగా మారటంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. బాలు చెరువు, గ్రామ సచివాలయం, మెయిన్ సెంటర్, పాత ఎంపీడీవో ఆఫీస్, పవర్‌పేట వద్ద ఉన్న రహదారి మలుపులు ప్రమాదకరంగా మారాయి. విస్సన్నపేట- చింతలపూడి రహదారిలో ఉన్న చాట్రాయిలో రోడ్లు బాగా ఇరుకుగా ఉండటం, రోడ్డు మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించే అవకాశం లేకపోవటం, అతివేగం మొదలైన కారణాలతో రోడ్డు మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎన్టీఆర్-ఏలూరు జిల్లాలను కలిపే రహదారిలో ఉండటం వల్ల నిత్యం చాట్రాయి మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం 50, 60 టన్నుల భారీ వాహనాలు నిరంతరం తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదకర రోడ్డు మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.



చాట్రాయిలో పాత ఎంపీడీవో ఆఫీస్ వద్ద..

అధికారుల సమన్వయంతోనే తప్పిన ముప్పు

- ఎమ్మెల్యే కామినేని
- అధికారులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో అధికారులు ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా తీసుకున్న చర్యలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని జిల్లా పంచాయతీ అధికారి కె. అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ సమయంలో కూలిన చెట్లను అర్ధరాత్రి సమయంలో కూడా తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడంలో అన్ని శాఖల అధికారులు కీలకపాత్ర పోషించారని అన్నారు. తుఫాన్ సమయంలో పనిచేసిన అన్ని శాఖల అధికారులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. గ్రామాల్లో ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుని పారిశుధ్య పనులు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆక్వాచెరువుల్లోని నీరు రహదారులపైకి తోడితే రెవెన్యూ అధికారులు వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. కైకలూరు పట్టణంలో ముఖ్యకూడలిలో చెత్త కుండీలను ఏర్పాటు చేస్తామని అవసరమైతే దాతల సహకారంతో అవసరమైన వాటిని కొనుగోలు చేస్తామన్నారు. కైకలూరు గ్రామ పంచాయతీలో కార్మికులకు బకాయి జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల రీసర్వేతో వచ్చిన ఎల్పీ నెంబర్ల సమస్యలు ఆక్వాచెరువులకు అప్సడా అనుమతులు ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. నిర్మాణదశలో నిలిచిపోయిన అంగన్వాడీ భవనాలకు పూర్తిచేయాలన్నారు. పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంకకు వెళ్లే రహదారి మెరక చేసి ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ మాట్లాడుతూ నవంబరు 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు చెత్తకుప్పలు వద్దు-చెట్లే ముద్దు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గ్రామాల్లో ఎక్కడా చెత్త లేకుండా పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. డీఎల్పీవో వై. అమ్మాజీ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వ్యవసాయ సదస్సుకు రాష్ట్ర రైతు నాయకుడు బలరాం

పాలకోడేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్ (ఫాస్) ఈ నెల 6 నుంచి 9 వరకు కేరళలోని తిరువనంతపురంలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర రైతు నాయకుడు బి.బలరాం హాజరు కానున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు తెలిపారు. బెంగుళూరు కేంద్రంగా పని చేస్తున్న స్వతంత్ర అధ్యయన పరిశోధనా సంస్థ ఆహ్వానం మేరకు అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతున్నట్లు బలరాం తెలిపారు. సదస్సును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారన్నారు. కేరళలో జరుగుతున్న సదస్సుకు అత్యంత ప్రాధాన్యం ఉందని ఆయన తెలిపారు.

తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా వెల్ది నాగేశ్వరరావు



చాట్రాయి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా కొత్తగూడెం మాజీ ఎంపీటీసీ వెల్ది నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి కొలుసు పార్థసారథి ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మంత్రి పార్థసారథికి, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు.

ఏపీ స్పెషల్ కమిషనర్‌ను కలిసిన బీజేపీ కో-కన్వీనర్ కృష్ణారావు



ముదినేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్‌ను సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో బీజేపీ ఏలూరు జిల్లా కో-కన్వీనర్ కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రం తరఫున ప్రత్యేక అధికార్లతో సమన్వయం సాధించటంలో కీలక పాత్ర పోషించటం అభినందనీయమని కృష్ణారావు తెలిపారు.

సమయ పాలన పాటించాలి: ఎంపీడీవో

చాట్రాయి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ కోరారు. మండలంలో బూరుగుగూడెం గ్రామ సచివాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సచివాలయం ద్వారా అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి, గ్రామంలోనే అన్ని పనులు జరిగేలా అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

రయ్..రయ్ !

(5వ పేజీ తరువాయి)

వాహనాలకు అనుమతులు ఉన్నాయి. ఇదే అదునుగా తీసుకుని కొన్ని టిప్పర్లు అనుమతులు ఉన్నాయని ఇసుక, మట్టిని నగరం మీదుగా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయి.

గతంలో ఎన్నో ప్రమాదాలు

నిత్యం భారీ వాహనాలు, టిప్పర్లు నగరం నడి బొడ్డులో తిరగడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో కర్రల వంతెన వద్ద ఒక వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోగా చిరంజీవి బస్టాప్ వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళను ఢీకొనడంతో ఆమె మరణించింది.ఈ ఏడాది అక్టోబరు 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఒక టిప్పర్ కైకలూరు నుంచి ఏలూరు శనివారపుపేటకు బుసకను తీసుకువెళ్తూ పెదపాడు బ్రిడ్జి మీదుగా వచ్చి అతి వేగంగా జూట్‌మిల్లు ఓవర్ బ్రిడ్జిపైకి వెళ్తూ ఒక కారును ఢీ కొంది. కారు ముందు భాగం నుజ్జునుజైంది.

కానరాని నిబంధనల బోర్డులు

ఏలూరు నగరంలో భారీ వాహనాల రాకపోకలపై ఉన్న నిబంధనలను విధిగా నగరంలోకి ప్రవేశించే రహదా రులపై బోర్డులను ఏర్పాటు చేయాలి. కానీ ట్రాఫిక్ పోలీసులు ఈ బోర్డులను ఏర్పాటు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. నగరంలో ఏ ప్రాంతాల్లో అనుమతి లేదో ఆ ప్రాంతాల వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేయాలి. భారీ వాహనాల డ్రైవర్లకు అవగాహన నిమిత్తం నగరంలో ప్రధానమైన కూడళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎక్కడా ఎలాంటి బోర్డులు కానరావడం లేదు. టిప్పర్ లారీకు అనుమతులు ఉన్నట్టు ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.అనుమతులు ఎవరు ఇచ్చారో ఆ లేఖను లారీ ముందు అద్దంపై ప్రదర్శించాలి. కాని ఏ టిప్పర్ లారీపై ఇలాంటి లెటర్ కన్పించకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి భారీ వాహనాల రాకపోకలపై ఉన్న నిబంధనలు అమలు చేసి ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో రవాణా శాఖ కార్యాలయాల తనిఖీ అధికారులు నిత్యం వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. టిప్పర్ లారీల్లో పరిమితికి మించి అదనపు లోడు వేసుకుంటే జరిమానాలు విధిస్తున్నాం. జిల్లాలో ఎవరైనా నిబం ధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలను సీజ్ చేస్తాం.

-షేక్ కరీమ్,
ఉప రవాణాశాఖాధికారి, ఏలూరు జిల్లా

అదే నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినా పట్టించుకోలేదు. ఫలితంగా లింగపాలెం మండలం జూబ్లీనగర్ మలుపు వద్ద టర్నింగ్ వద్ద బస్సును తిప్పలేక సోమవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో బోల్తా కొట్టించాడు. ఈ ప్రమాదంలో ఇదే మండలానికి చెందిన అయ్యపరాజు గూడెంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీరంకి ప్రవీణ్‌బాబు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌తోపాటు నరసన్నపాలెం, యడవల్లి, ధర్మాజీగూడెం, లింగపాలెం, అయ్యపరాజుగూడెంకు చెందిన 16 మంది మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్, క్లీనర్‌లు పరారయ్యారు. మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉద్యోగ బాధ్యతల నిమిత్తం కోసం వెళ్తూ ఊరికి దగ్గరలోనే ప్రవీణ్ మృత్యువాత పడటంతో తండ్రి వెంకన్న ప్రభుత్వాసుపత్రిలో రోదనలు మిన్నంటాయి. ఈ మరణానికి ఎవరిది బాధ్యత..?

మలుపులో ఇది మూడో ప్రమాదం

జూబ్లీనగర్ మలుపు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం మూడోది. మలుపు వద్ద గోతులు వుండటం వల్ల అంతకుముందు ఇక్కడే రెండు ప్రమాదాలు జరిగాయి. బస్సు తొలుత మఠంగూడెం-లింగపాలెంలో మధ్యలో ఆటోను రాసుకుంటూ వెళ్లింది. అక్కడ నుంచి వేగంగా వెళ్తూ మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టింది. వారు గాయపడ్డారు. తర్వాత మలుపు వద్ద బస్సు బోల్తా కొట్టింది. బస్సు పడినచోట గొయ్యి ఉండటంతో అందులో పడి ప్రవీణ్ బాబు మృత్యువాత పడ్డాడు. సమాచారం అందడంతో సీఐ క్రాంతికుమార్, ఎస్‌ఐలు క్షతగాత్రులను అంబులెన్స్‌లో వైద్యం కోసం తరలించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ వచ్చి పరిస్థితిని ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రవీణ్‌బాబు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

క్షతగాత్రులు వీరే..

బస్సులో ప్రయాణిస్తున్న 13 మందిని బయటకు తీశారు. స్వల్పగాయాలైన వారిలో 10 మందిని లింగపాలెం పీహెచ్‌సీకి, ఆసన్నగూడేనికి చెందిన అడపా సురేష్‌ను చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో జి.వంశీ, ఎం.కిరణ్, కె.వేణుగోపాలకృష్ణ, కె.నాగశిరోమణి, కె.నాగవెంకట ప్రవీణ్, సీహెచ్ ఈశ్వర్, వి.బెంజిమన్, ప్రసాదరెడ్డి, జి.వెంకటరెడ్డి, జి.వెంకటలక్ష్మితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. కాగా బస్సు ఢీకొట్టగా గాయపడిన బైక్ మీద వెళ్తున్న బి.రెడ్డయ్య, పేరం కృష్ణను తొలుత లింగపాలెం పీహెచ్‌సీకి ఆపై ఏలూరు ప్రభుత్వాస్పతికి తరలించారు.

సత్వరం వైద్యం అందించండి : కలెక్టర్ ఆదేశం

బస్సు ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో అమృతంను ఆదేశించారు. పరిస్థితిని సమీక్షించుకుని అధికారులతో సమన్వయం చేసుకోవాలని సహాయ చర్యలను చేపట్టాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్నను కలెక్టర్ ఆదేశించారు.



బలివేలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కోరుకొల్లులో స్వామికి గంధాభిషేకం



దేవపూడిలో విజయదుర్గాదేవికి అలంకరణ

హర హర మహాదేవ

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు.. భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

ముసునూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులు తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపారాధనలు చేసి, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

చాట్రాయి: మండలంలో శివాలయాలు కిటకిటలాడాయి. చాట్రాయి, సి. గుడిపాడు, తుమ్మగూడెం తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి శివుడికి పూజలు చేశారు. ఆలయ కమిటీలు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశాయి.

కైకలూరు: కార్తీక మాసోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వర, కనక లింగేశ్వర స్వామివార్లకు విశేష పూజలను నిర్వహించారు. భస్మాభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ముత్తంరాజు శర్మ, రాజశేఖర్ దంపతులు, బందా నారాయణరావు దంపతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున స్వామివార్లను దర్శించుకుని ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఈవో వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించారు.

ముదినేపల్లి: అల్లూరు సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కార్తీక దీపారాధనలు నిర్వహించగా, ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు ఐలూరి సుబ్బరాయ శర్మ స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ముదినేపల్లిలోని పెదరామాలయంలో భక్తులు దీపాలతో శివలింగార్చన జరిపారు. దేవపూడిలోని విజయదుర్గాదేవికి పూజలు నిర్వహించారు.




శ్రీశ్యామలాంబ ఆలయంలో మహిళల పూజలు

కలిదిండి: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సామూహిక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. కోరుకొల్లులో సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి గంధంతో అభిషేకం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెదలంకలో నాగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక అభిషేకాలు, పూజలు జరిగాయి.

డిసెంబరులో లిబరేషన్ పార్టీ రాష్ట్ర మహాసభలు

ముసునూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. సోమవారం గుళ్ళపూడిలో మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ కడప జిల్లాలో డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే మహాసభలను రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని, తడిచి న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

డీసీ మాజీ చైర్మన్ 'ఉలిసి' మృతి



కలిదిండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లుకు చెందిన డీసీ మాజీ చైర్మన్ ఉలిసి సోమేశ్వరరావు (80) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, నీటి సంఘం అధ్యక్షులు కేశిరెడ్డి బలరామ్, పలువురు నాయకులు సోమేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

క్రైమ్ కార్నర్

పట్టపగలు చోరీ

ఆగిరిపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇంట్లోకి చొరబడి బంగారు వస్తువులు కాజేసిన ఘటన కొత్త ఈదరలోని బెక్కం రుద్ర చంద్రశేఖర్‌రావు ఇంట్లో సోమవారం ఉదయం జరిగింది. చంద్రశేఖర్‌రావు భార్య పెద్ద సీత (55) సమీపంలోని ఓ దుకాణంలోకి పాల కోసం వెళ్ళింది. వెంటనే తిరిగి వచ్చేస్తానన్న ఉద్దేశంతో తలుపులను దగ్గరకు వేసి వెళ్ళింది. ఇదే అదునుగా ఓ ట్రాన్స్‌జెండర్ లోపలకు చొరబడి ఇంట్లోనే టేబుల్‌పై ఉన్న ఐదు బంగారం ఉంగరాలు, ఒక గాజు, చెవి దిద్దులు చోరీ చేసి పరారవుతుండగా సీత బంధువు అడ్డుకున్నప్పటికీ ద్విచక్ర వాహనంపై పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శుభశేఖర్ తెలిపారు.